నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | VIKARABAD

జనావాసాల్లోకి జింక

నగరంలో గురువారం ఓ జింక జనావాసాల్లోకి వచ్చింది. ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయ సమీపంలోని ఓ ఇంట్లోకి ఎక్కడి నుంచో జింక వచ్చింది. దీనిని గమనించిన స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఆ జింకను ఆధీనంలోకి తీసుకొని వెంటనే జూపార్క్ అధికారులకు అప్పగించారు.

-మెహిదీపట్నం, ఫిబ్రవరి 27

ఇదేమి న్యాయం..?

పరిహారం ఫైనల్ కాకుండానే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి టెండర్లా..?

- భూమికి భూమి లేదా.. మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్
- లేకుంటే భూములు ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్న రహదారి బాధిత గ్రామాల రైతులు

రేవంత్ సర్కార్ ఫ్యూచర్‌సిటీ కోసం కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు 300 అడుగుల వెడల్పుతో రేడియల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. భూములు కోల్పోనున్న బాధిత రైతులు రోడ్డు సర్వే పనులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయినప్పటికీ పోలీసుల పహరా మధ్య సర్వే పనులను పూర్తి కానిచ్చారు అధికారులు. మొదటి దశలో కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 18 కిలోమీటర్ల మేర రోడ్డు వేస్తున్నారు. రెండో దశలో మీర్‌ఖాన్‌పేట ఫ్యూచర్‌సిటీ నుంచి ఆకుతోటపల్లి ఆర్ఆర్ఆర్ వరకు 22 కిలోమీటర్ల మేర రహదారి వేయనున్నారు. ఇందుకోసం 1,004 ఎకరాల భూమిని, సుమారు 4,725 మంది రైతుల నుంచి బలవంతంగా సేకరిస్తున్నారు. మొదటి, రెండో విడత రోడ్లను సుమారు 14 గ్రామాల మీదుగా కొంగరకలాన్ నుంచి ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు, యాచారం, ఆమనగల్లు మండలాల్లోని గ్రామాల నుంచి వేస్తున్నారు. రోడ్డు వేయడంతో అర ఎకరం, ఎకరం, రెండు ఎకరాల భూములను కోల్పోతున్నామని.. ఎట్టి పరిస్థితిలోనూ తమ భూములను ఇచ్చేది లేదని రైతులు ఆందోళనబాట పట్టారు. అయినా ప్రభుత్వం మాత్రం తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోతున్నది.

> గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోనున్న రైతులకు పరిహారం ఇంకా ఫైనల్ కాకుండానే ప్రభుత్వం రోడ్డు ఏర్పాటు కోసం టెండర్లకు శ్రీకారం చుట్టింది. దీంతో బాధిత రైతులు ఇదేమి లెక్క అంటూ సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు భూమికి భూమి లేదా.. మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ..లేకుంటే భూములు ఇచ్చేది లేదని బాధిత గ్రామాల రైతులు తేల్చి చెబుతున్నారు.
>
> -రంగారెడ్డి, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ)

పరిహారం తేల్చకుండానే టెండర్లు..

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతో వేలాది మంది రైతులు తమ భూములను కోల్పోతున్నారు. వారికి పరిహారం ఎంతిస్తామనేది తేల్చకుండానే సర్కారు టెండర్లు పిలవడంపై బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా రైతులు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని, లేని పక్షంలో మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చిన అధికారులు.. దీనిపై ఏమి తేల్చకుండానే టెండర్లు పిలవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేయనున్న కొంగరకలాన్, రావిర్యాల, కందుకూరు, ఫిరోజ్‌గూడ, కొంగరకుర్దు, లేమూర్, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట తదితర గ్రామాల్లో భూముల ధరలు రూ.కోట్లల్లో పలుకుతున్నాయి. ముఖ్యంగా కొంగరకలాన్, రావిర్యాల, కందుకూరు మండలాల్లో ఎకరాకు సగటున రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు డిమాండ్ ఉన్నది. ప్రభుత్వం మాత్రం మార్కెట్ ధరకు రెండు లేదా మూడింతలు అధికంగా ఇస్తామని చెబుతున్నది.

కాగా మార్కెట్ ధర రూ. పది నుంచి రూ. పదిహేను లక్షల వరకే ఉన్నది. దీంతో మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇస్తే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం పరిహారం విషయాన్ని ఎటూ తేల్చడంలేదు.

రైతులతో చర్చించి పరిహారాన్ని నిర్ణయిస్తాం..

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతో భూములు కోల్పోనున్న రైతులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైనది. ఎంత మంది రైతుల నుంచి ఎన్నిక ఎకరాల భూములు పోతున్నాయనేది సర్వే ఆధారంగా నిర్ధారిస్తాం. ఇప్పటికే రైతులతో సమావేశాలు నిర్వహించి వారిని ఒప్పించే ప్రయత్నం చేశాం. త్వరలోనే మరోమారు రైతులతో చర్చించి పరిహారాన్ని నిర్ణయిస్తాం. రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. వారికి న్యాయం జరిగేలా చూస్తాం. రైతులకు త్వరలోనే నోటీసులు ఇస్తాం.

-రాజు, భూసేకరణ ప్రత్యేకాధికారి

నేటి నుంచి టెండర్లు..

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు నేటి నుంచి టెండర్లకోసం హెచ్ఎండీఏ అధికారులు దరఖాస్తులు కోరుతున్నారు. మార్చి 21 వరకు దరఖాస్తులను స్వీకరించి 21 తర్వాత బిడ్లను ఓపెన్ చేయనున్నట్లు సమాచారం. ఫేస్-1లో ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19 కిలోమీటర్లు, ఫేస్-2లో మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమనగల్లు ట్రిపుల్ఆర్ వరకు టెండర్లు కోరుతున్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2,365 కోట్లుగా అధికారులు ప్రకటించారు.

భూమికి భూమి ఇవ్వాల్సిందే..

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతో భూములు కోల్పోనున్న బాధిత రైతులు భూమికి భూమి లేదా మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పరిహారం విషయాన్ని ఇంకా తేల్చకుండానే.. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఎలా టెండర్లు పిలుస్తారని మండిపడుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతో భూములు కోల్పోనున్న రైతుల్లో అత్యధికంగా సన్న, చిన్నకారు రైతులే ఉన్నారని.. ఉన్న అర ఎక రం, ఎకరం, రెండు ఎకరాల భూములను రోడ్డు నిర్మాణానికి తీసుకుంటే తాము ఎలా బతకాలని.. భూమికి భూమి ఇస్తే మరోచోట భూములను కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుని జీవిస్తామని పేర్కొంటున్నారు. పరిహారం తేల్చకుండానే టెండర్లు పిలవడంపై బాధిత గ్రామాల్లో అలజడి మొదలైంది.

మద్వాపూర్‌లో కొన్ని నెలల కిందట వేసిన సీసీ రోడ్డుకు వచ్చిన పగుళ్లు

మూన్నాళ్ల ముచ్చటే..

- వేసిన నెలల వ్యవధిలోనే సీసీ రోడ్లకు బీటలు, పగుళ్లు
- కాంట్రాక్టర్లకు అధికారుల వత్తాసు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు

బంట్వారం/కోట్‌పల్లి, ఫిబ్రవరి 27 : కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. గతేడాది మండలంలోని అనేక గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ. 5,00,000 నుంచి 10,00,000లతో సీసీ రోడ్లను ఏర్పాటు చేశారు. వాటిని నాణ్యతాప్రమాణాలు పాటించక వేయడంతో వేసిన మూడు నెలలకే బీటలు వారాయి. మరో రెండు నెలలు దాటగానే పగుళ్లు వచ్చాయి. ఇలా ఏడాది కూడా పూర్తి కాలేదు రోడ్లన్నీ పగిలిపోతున్నాయి. ఇందుకు నిదర్శనం మండలంలోని మద్వాపూర్ గ్రామం. ఈ ఊరిలో సీసీ రోడ్డు వేసిన కొన్ని నెలలకే దానిపై పగుళ్లు వచ్చాయి. వాహనాలు వెళ్తుండడంతో పూర్తిగా ధ్వంసమవుతుండడంతో స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసిన మూడు నెలలకే రోడ్డు పగిలిపోతే క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఏమి చేస్తున్నారని దుమ్మెత్తిపోస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం కాంట్రా క్టర్లపై చర్యలు తీసుకోక వారికే వత్తాసు పలకడం గమనార్హం.

వాహనాలు వెళ్లడంతో ధ్వంసమైన సీసీ రోడ్డు

మీరాలం పనులు ఇంకెప్పుడు?

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ) : 'మీరాలం చెరువుపై సుందరమైన కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తాం. దీనితో పర్యాటకంగా ఆ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు, ఓల్డ్‌సిటీ రవాణా సదుపాయాలు మెరుగుపడతాయి. బెంగళూరు హైవేకు మరింత వేగంగా చేరుకునే వెసులుబాటు దొరుకుతుంది.' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి పలు వేదికలపై ప్రసంగించారు. కానీ, ఈ ప్రాజెక్టును ఎవరు చేపడుతున్నారనేది ఇప్పటికీ గందరగోళంగానే ఉన్నది. గతంలో ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేసేందుకు హెచ్ఎండీఏ ట్రాన్సాక్షనల్ అడ్వైజరీల నియామాకానికి చర్యలు చేపట్టింది. ఆ తర్వాత పలుమార్లు ముఖ్యమంత్రి చేసిన సమీక్షలు హెచ్ఎండీఏ అధికారులు లేకుండానే జరిగాయి. అదే సమయంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం చర్చించింది. అసలు ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను ఏ విభాగం పర్యవేక్షిస్తున్నదని ఇప్పుడు ప్రశ్నగా మారింది. మీరాలం చెరువును పర్యాటక ప్రాంతంగా, బెంగళూరు హైవేకు రవాణా సదుపాయాలను మెరుగుపరిచేలా ఆధునీకరించాలని కేసీఆర్ ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకున్నది. మీరాలం బ్యూటిఫికేషన్‌పై అప్పట్లోనే కార్యాచరణ రూపొందించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అంచనా, ప్రాజెక్టు విధివిధానాలు, డీపీఆర్ రూపకల్పనపై హెచ్ఎండీఏ కసరత్తు చేసి ప్రభుత్వానికి అందజేసింది. అయితే అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ చెరువుపై నిర్మించే కేబుల్ బ్రిడ్జి నిర్మాణాన్ని గందరగోళంలో పడేశారు.

టెండర్లను పిలిచింది హెచ్ఎండీఏనే..

మీరాలం చెరువు అభివృద్ధికి చేపట్టాల్సిన నమూనాలను తీర్చిదిద్దేందుకు కన్సల్టెన్సీని ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏనే తొలుత టెండర్లను ఆహ్వానించింది. ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేసి, పబ్లిక్-ప్రైవేట్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించే పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ఖర్చు, ట్రాఫిక్ రద్దీ వంటివి పరిగణనలోకి తీసుకుని ఈ ఏజెన్సీకి డీపీఆర్ సిద్ధం చేసే బాధ్యతలను అప్పగించేలా టెండర్లను పిలిచింది. కానీ ఆ తర్వాత జరిగిన సమీక్షలు హెచ్ఎండీఏ ప్రమేయం లేకుండా నిర్వహించడంతో గందరగోళం మొదలైంది.

ప్రాజెక్టు తీరుతెన్నులివి..

బెంగళూరు హైవే మార్గాన్ని మరింత విస్తరించేలా ఆరులైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. బెంగళూరు హైవే నుంచి చింతల్‌మెంట్ మీదుగా అత్తాపూర్ వరకు 2.65 కి.మీ దూరంలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానున్నది. ట్రాఫిక్ రద్దీ, రవాణా దూరం తగ్గిపోవడంతోపాటు మీరాలం చెరువును చూసేందుకు వీలుగా ఉండేలా ప్రాజెక్టు డిజైన్ ఉండాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. దీనిపై వ్యూ డెక్, స్కై వాక్‌తో పాటు నెహ్రూ జువాలజికల్ పార్క్‌ను చేరుకునేలా డిజైన్ చేశారు.

ఆస్తిపన్ను రాయితీ రద్దు?

గత కేసీఆర్ సర్కారు ఇచ్చిన రూ.101 పథకానికి నీళ్లొదిన బల్దియా

- పన్ను సవరణ పేరుతో ఇష్టారీతిలో బిల్లులు జారీ
- నాలుగింతల రేట్ల బిల్లులు పెంచి బకాయిలు కట్టాలంటూ నోటీసులు
- కంగుతింటున్న యజమానులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ఓల్డ్ బోయిన్‌పల్లి హస్మత్‌పేటలో సీహెచ్ ప్రసాద్‌రావు తన ఇంట్లో 40 ఏండ్ల నుంచి నివాసం ఉంటున్నాడు. పీటీఐఎన్ నంబరు 1140900341 కలిగిన తన ఇంటికి ఏటా రూ.1100 ఆస్తిపన్ను చెల్లించేవాడు. 2017లో కేసీఆర్ ప్రభుత్వం ఆస్తిపన్ను రూ.1,200 లోపు ఉన్న భవనాలకు ఏటా రూ.101 పన్ను చెల్లిస్తే సరిపోతుందని ప్రత్యేక పథకాన్ని తీసుకొస్తూ జీవో జారీ చేసింది. ఈ పథకాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకుంటూ వచ్చారు. ఇటీవల సదరు యజమాని ప్రసాద్‌రావుకు ఎలాంటి సమాచారం లేకుండానే సవరించిన ఆస్తిపన్ను నోటీసు అందింది. రూ. 101 నుంచి ఏటా రూ. 10,608ల చొప్పున ట్యాక్స్ వేసి నాలుగేండ్ల పన్ను ఒకేసారి రూ. 43,267 చెల్లించాలని ఆ నోటీసు సారాంశం. దీంతో కంగుతినడం ప్రసాద్‌రావు వంతైంది.

ట్యాక్స్‌ను అకస్మాత్తుగా ఎందుకు సవరించాల్సి వచ్చింది? రూ. 101 స్కీం ఎత్తివేస్తూ జీవో ఏమైనా జారీ చేశారా? ఒకవేళ సవరిస్తే గతంలో మాదిరిగా రూ.1100లు కట్టాలి.. కానీ ఎందుకు ఏటా రూ.10,608 కట్టాలి? వంటి ప్రశ్నలు వేసుకుంటున్నాడు. తన ఇంటి చుట్టు పక్కల ఎవరికీ రూ.1400 నుంచి రూ.2800లకు మించలేదు..ఇదెక్కడి అన్యాయమని డిప్యూటీ కమిషనర్లను,టీఐ (ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల)ను అడిగినా ఫలితం లేదు. ఇదేక్కడి సవరణ, ఆస్తిపన్నుల జారీలో ఇష్టారాజ్యంగా అధికారుల వ్యవహారం ఉందంటూ సదరు ప్రసాదరావు సమగ్ర వివరాలతో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇక్కడ ఒక్క ప్రసాదరావుకే కాదు.. గ్రేటర్‌లో చాలామంది రూ.101 స్కీం లబ్ధిదారులపై జీహెచ్ఎంసీ ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నది. ఇటీవల జీహెచ్ఎంసీ ప్రతి శనివారం నిర్వహిస్తున్న ఆస్తిపన్ను పరిష్కార వేదికలోనూ ఈ తరహా ఫిర్యాదులు వస్తుండడం అధికారుల పనితీరుకు నిదర్శనం.

అడ్డగోలుగా సవరణలు

జీహెచ్ఎంసీ పరిధిలో 19.49లక్షల ఆస్తులు ఉన్నాయి. వీటిలో గృహాలు 16.35 లక్షలు, గృహాలు కానివి 2.80 లక్షలు, మిక్స్‌డ్ 34 వేల వరకు ఉన్నాయి. వీటిని ఈ ఆర్థిక సంవత్సరం నాటికి రూ.2100 కోట్లు రాబట్టే లక్ష్యంతో ఇప్పటి వరకు12.50 లక్షల మంది చెల్లింపుదారుల నుంచి రూ. 1506 కోట్ల వరకు రాబట్టారు. లక్ష్యం చేరుకునేందుకు ప్రస్తుతం రూ.101 ఆస్తిపన్ను చెల్లిస్తున్న భవనాలకు రేట్లను సవరించి పెంచాలని జీహెచ్ఎంసీ నిర్ణయించి, పెంచిన నాలుగు రేట్ల పన్ననే టార్గెట్‌గా వసూలు చేస్తున్నది. నాలుగు కేటగిరీల్లోని రెండు లక్షల నిర్మాణాలను సర్వే చేసి..మొత్తంగా రూ.50 కోట్ల మేర ఆదాయం పెంచుతుండడం గమనార్హం. ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండానే అడ్డగోలుగా సవరణలు చేస్తుండడం, ఇందుకు విద్యుత్‌శాఖ బిల్లులు, సబ్ రిజిస్ట్రార్ల ను పావుగా వాడుకుంటూ క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారీతిలో వ్యవహరిస్తుండడంతో ఆస్తిపన్ను బాధితుల సంఖ్య పెరిగిపోతున్నది. క్షేత్రస్థాయిలో ఏండ్ల తరబడి పాతుకుపోయిన టీఐ (ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యాలయాల సిబ్బందిపై నిఘా పెట్టి స్థానం చలనం కల్పించాలన్న డిమాండ్ వ్యక్తమవుతున్నది.

రాయితీ పథకానికి రాంరాం..

పేద, మధ్యతరగతి ప్రజలకు కల్పించిన ఆస్తిపన్ను రాయితీ పథకానికి కాంగ్రెస్ సర్కారు నీళ్లొదిలింది. ఆస్తిపన్ను రూ.1200 లోపు ఉన్న నిర్మాణాలకు 2017లో కేసీఆర్ ప్రభుత్వం పన్ను రాయితీ ఇచ్చింది. ఆ పరిధిలోని యజమానులంతా ఏడాదికి రూ. 101 పన్ను చెల్లిస్తే సరిపోతుందని జీవో జారీ చేసింది. ఈ మేరకు రూ.100 కోట్ల మేర చెల్లింపుదారులకు లబ్ధి జరిగింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అనధికారికంగా రద్దు చేసింది. పన్ను సవరణ పేరుతో లబ్ధిదారుల మెడపై కత్తి పెట్టి. మీకు రూ.101 ఆస్తిపన్ను పథకం వర్తించదని, ఇకపై పూర్తి స్థాయిలో పన్ను చెల్లించాలంటూ ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నది. దీనిపై కార్పొరేటర్లు, ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెక్షన్ 220 ప్రకారం ట్యాక్స్ సవరణపై ప్రత్యేకంగా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం రూ.101 చెల్లించే పన్ను చెల్లింపుదారులకు పన్ను రాయితీ లేదంటూ ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నారు. ఇదే సమయంలో వాణిజ్య కేటగిరీలో విద్యుత్తు కనెక్షన్లు ఉన్న నిర్మాణాలు, సున్నా విస్తీర్ణం కింద పన్ను చెల్లించిన భవనాలు, ఆస్తిపన్ను సున్నా రూపాయలుగా ఉండే నిర్మాణాలకు నోటీసులు ఇస్తున్నారు.

మాకెప్పుడు ఇస్తారు..?

రైతుభరోసా కోసం అన్నదాతల ఎదురుచూపులు

- వికారాబాద్ జిల్లాలో ఇప్పటివరకు సగం మంది రైతులకే అందిన పెట్టుబడి సాయం
- జిల్లాలో అర్హులైన రైతులు 3,12,872 మంది ఉండగా.. 1,74,495 మందికే ..
- రైతుభరోసా ఆలస్యంపై భగ్గుమంటున్న అన్నదాతలు
- నిరీక్షిస్తున్న 1,38,377 మంది అన్నదాతలు
- బీఆర్ఎస్ హయాంలో సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందజేత

> రైతుభరోసా పెట్టుబడి సాయం జిల్లాలో సగం మందికే అందడంతో మిగిలిన అర్హులైన రైతులు తమకెప్పుడు అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తమ బ్యాంకు ఖాతాల్లో ఎప్పుడు డబ్బులు జమ చేస్తారని వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా, జిల్లాలో 3,12,872 మందిని అధికారులు అర్హులుగా గుర్తించి.. ఇప్పటివరకు మూడెకరాల్లోపు గల 1,74,495 మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించారు.

వికారాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేస్తున్నది. ముఖ్యంగా రైతులను నట్టేట ముంచుతున్నది. కేసీఆర్ హయాంలో పదేండ్లపాటు సీజన్‌కు ముందే పెట్టుబడి సాయాన్ని అందించి అప్పుల్లో కూరుకుపోయిన అన్నదాతను బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకున్నది. మోసపూరిత హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులకు రైతుభరోసాను ఏడాదికి రూ.15,000 అందిస్తామని అబద్ధపు హామీనిచ్చి రూ.12,000 తగ్గించింది. ఒకేసారి రైతుల బ్యాంకు ఖాతాల్లో టింగ్‌టింగ్ మంటూ రైతు భరోసా సాయాన్ని జమ చేస్తామన్న మాటను కూడా సక్రమంగా నిలబెట్టుకోలేకపోయింది.

విడతల వారీగా రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని జమ చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ మొదట మండలానికి ఒక గ్రామాన్ని చొప్పున ఎంపిక చేసి.. తదనంతరం ఎకరం, రెండెకరాలు, తదనంతరం ఇప్పటివరకు మూడెకరాల వరకు పెట్టుబడి సాయాన్ని రైతన్న బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే, ఇప్పటివరకు జిల్లాలో అర్హులుగా గుర్తించిన రైతుల్లో కేవలం సగం మందికే పెట్టుబడి సాయం అందింది. మిగతా రైతులు తమకు సాయం ఎప్పుడు అందుతుందని వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో 3,12,872 మందిని అధికారులు అర్హులుగా గుర్తించి రూ.385. 46 కోట్ల సాయాన్ని అందించాలని నిర్ణయించగా.. ఇప్పటివరకు మూడెకరాల్లోపుగల 1,74,495 మంది రైతులకు రూ. 143.13 కోట్ల రైతుభరోసా సాయాన్ని మాత్రమే అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. మిగతా రైతులకు రైతుభరోసా సాయం ఎప్పుడు జమ అవుతుందనేది అధికారులకూ స్పష్టత లేకపోవడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ అమల్లోకి తీసుకొచ్చిన రైతుభరోసాపై రైతాంగం భగ్గుమంటున్నది. పెట్టుబడి సాయాన్ని కొద్దిమందికే అందించి మిగిలిన వారికి ఎప్పుడు పంపిణీ చేస్తారో కూడా చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్ హయాంలో సీజన్‌కు ముందే..

గత కేసీఆర్ హయాంలో ప్రతి ఏటా సీజన్‌కు ముందే ఎకరానికి రెండు సార్లు రూ. ఐదు వేల చొప్పున రైతుబంధు సాయాన్ని అందించింది. దీంతో అన్నదాతలు సకాలంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకున్నారు. జిల్లాలో 12,35,000 ఎకరాల్లో వ్యవసాయ భూములుండగా.. ప్రతి సీజన్‌లో 6,20,000 ఎకరాల వరకు రైతుబంధు సాయాన్ని అందించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా కింద పెట్టుబడి సాయానికి దాదాపు 40,000 ఎకరాలను తగ్గించి 5,80,000 ఎకరాలకు తగ్గించింది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద రూ. 2,926 కోట్ల సాయాన్ని రైతులకు పెట్టుబడి నిమిత్తం అందజేసింది. 2018 వానకాలంలో 1,94,833 మందికి రూ.221 కోట్లు, యాసంగిలో 1,75,989 మందికి రూ.206 కోట్లు, 2019 వానకాలంలో 1,78,998 మందికి రూ.255 కోట్లు, యాసంగిలో 1,71,824 మందికి రూ.194 కోట్లు, 2020 వానకాలంలో 2,113,341 మందికి రూ.297 కోట్లు, యాసంగిలో 2,19,264 మందికి రూ.301 కోట్లు, 2021 వానకాలంలో 2,25,438 మందికి రూ.300 కోట్లు, యాసంగిలో 2,24,928 మందికి రూ.241 కోట్లు, 2022-23 వానకాలంలో 2,47,707 మందికి రూ.305 కోట్లు, యాసంగిలో 2,43,447 మందికి రూ.299 కోట్లు, 2023-24 వానకాలంలో 2,62,065 మందికి రూ.307.47 కోట్ల పెట్టుబడి సాయాన్ని ఎకరాకనికి రూ.5 వేల చొప్పున నేరుగా అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.